నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

- నాయకులకు నిర్దేశించిన ఎమ్మెల్యే సత్యానంద్ రావు

రావులపాలెం,మేజర్న్యూస్ : కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిర్దేశించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు వారి కుటుంబ సభ్యుల పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసాగా ఉండేందుకు సభ్యత్వం చాలా ముఖ్యమని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం 100 రూపాయలు చెల్లించి తీసుకుంటే 5 లక్షల ప్రమాద బీమా పిల్లల చదువుకి ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం అవ్వడానికి పార్టీ కుటుంబ సభ్యులంతా కలిసి కృషి చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరవల్లి శంకర్‌ని అరెస్టు చేయాలి

కాకినాడ,మేజర్న్యూస్ : తెలంగాణలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరవల్లి శంకర్‌ని అరెస్టు చేయాలని ఆంధ్ర రాష్ట్ర వెలమ సంఘ నాయకులు డిమాండ్ చేసినారు. గత రెండు రోజుల క్రితం శంకర్ వెలములను చంపుతామని కించపరిచి వెలమ జాతిని అగౌరపరిచినట్లుగా సోషల్ మీడియాలో పెట్టడం జరిగింది. అతనిని వెంటనే అరెస్టు చేసి వెలమ సంఘాల నాయకుల సమక్షంలో బహిరంగం క్షమాపణ చెప్పాలని లేనిచో ఆంధ్ర రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి వెలములు నీపై పోలీస్ కంప్లైంట్ ఇచ్చి కార్యక్రమం చేస్తారని ఈ సందర్భంగా మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు, ఆంధ్ర రాష్ట్ర తొంబై మూడు బీసీ కులాల ఐక్యవేదిక వెలమ రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. నీవు ఒక బీసీ ఎమ్మెల్యేగా అన్ని కులాల ఓట్లు వేసుకొని ప్రజాప్రతినిధిగా ప్రవర్తించకుండా ఒక గుండా ఎమ్మెల్యేగా ప్రవర్తించిన తీరు బీసీ సంఘాలన్నీ కూడా తలదించుకునే, వెలమల ఆత్మగౌరాన్ని దెబ్బతీసే విధంగా నీవు మాట్లాడిన మాటలు నాలుగు గోడల మధ్యలో వెనక్కి తీసుకున్నానని చెప్తే సరిపోదని, బహిరంగంగా వెలమజాతి పెద్దల మధ్యలో నీవు క్షమాపణ చెప్తే నీకు గౌరవంగా ఉంటుందని, నీకు బిక్ష పెట్టిందే వెలమజాతి మాజీ సీఎం కేసీఆర్, అది తెలుసుకోకుండా నువ్వు పుట్టుక నుంచి ఎమ్మెల్యే అయినట్లు ఇవాళ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నెగ్గి ఈరోజు నువ్వు తల్లికి పాలు త్రాగి రొమ్ము గుద్దినట్లుగా స్టేట్మెంట్ ఇవ్వడంలో నీవు ఎంత దిగజారి పోయావు, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలో కాకినాడ సిటీలో నీ దిష్టిబొమ్మకు చెప్పులు వేసి కాళ్లతో తన్నించుకునే పరిస్థితి తెచ్చుకున్నందుకు మేము సిగ్గు పడుతున్నాము, నీవు నిజంగా కేసీఆర్ ఫ్యామిలీతో నీకు వైరము ఉంటే కెసిఆర్ పేరు పెట్టి నీవు మాట్లాడాలి గాని వెలమ కులస్తులను చంపేస్తా ఖబర్దార్ నేను కాంగ్రెస్ ఎమ్మెల్యే అని సీఎంకి తెలియకుండా నిన్ను మిమ్మల్ని చంపేస్తానంటే ఇక్కడ ఎవ్వరు కూడా గాజులు తొలగించుకోలేదు, నీకు బిక్ష పెట్టిందే కేసీఆర్, తెలంగాణ రాష్ట్రం తెచ్చిన వెలమ బిడ్డ కేసీఆర్ అని తెలుసుకో, మా వెలమ జాతికి తాండ్ర పాపారాయుడు, రేచర్ల బ్రహ్మనాయుడు వాళ్ళని దృష్టిలో పెట్టుకొని మాట్లాడితే మంచిదని షాద్‌నగర్ ఎమ్మెల్యేకి ఆంధ్ర రాష్ట్ర 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షునిగా వెలమ జాతి బిడ్డగా నిన్ను హెచ్చరిస్తున్నాము అన్నారు.ఈకార్యక్రమంలో వెలమ రాష్ట్ర నాయకులు, 93 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్,వెలమ సంఘ నాయకులు..రాజన్ రాజేశ్వరరావు,యాసలపు దుర్గా ప్రసాద్, ఎడ్ల కృష్ణ, మహిళా నాయకురాలు ఏటుకూరి నాగమణి, సిలుకు గంగబాబు, గంగ బాబు, తానారి గంగాధర్, కాళ్ల భాస్కర్, గుత్తల రవి, అదరపు రెడ్డి శ్రీనివాస్, మాకిరెడ్డి రామకృష్ణ, గురుఅప్పారావు,కర్రీ శ్రీనివాసరావు, రొంగలఅప్పారావు,ఎస్.సత్యనారాయణ,శ్రీదేవి,వెంకటలక్ష్మి, కే.దేవుడు, ఎం.మోహన్ రావు, నాగిరెడ్డి గాంధీ, కర్రీ గణపతి పాల్గొన్నారు.

జనవరి 5న ఛలో విజయవాడ శంఖారావానికి తరలిరండి

అంబాజీపేట,మేజర్న్యూస్ : వచ్చే ఏడాది జనవరి 5న ఛలో విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ కార్యక్రమానికి హిందువులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పి.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. కముజువారిలంక శివారు శ్రీరామపురంలో విశ్వ హిందూ పరిషత ధర్మప్రచారక్ సమావేశాన్ని ధర్మప్రచారక్ కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ హైందవసాంప్రదాయాలను,ఆలయాల రక్షణ అవశ్యకతను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు.అనంతరం హైందవ సాంప్రదాయాలను భక్తులకు వివరించారు. అనంతరం ఛలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వాసంశెట్టి పల్లంశెట్టి. గుబ్బల సత్యనారాయణ,బొక్కారామకృష్ణ, కముజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.50 లక్షలు విరాళం

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన డా.యలమర్తి రవి శంకర, డా. లక్ష్మిచైతన్య రూ.1,52,857లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం స్వామివారి హుండీల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో 'అజొల్లా' సాగుపై వర్క్‌షాప్

రంపచోడవరం,మేజర్న్యూస్ :రంపచోడవరం ప్రభుత్వడిగ్రీ కళాశాలలో అజొల్లా సాగుపై వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ ఆధ్వర్యంలో అజొల్లా సాగుపై వర్క్‌షాప్ ను కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ మత్స్య శాస్త్రవేత్త డా.కె వీరాంజనేయులు నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా అజొల్లా సాగు, ఉపయోగాలు,పశువులకు మేతగా ఎలావాడాలి,ఎలా పెంచాలో వివరించారు.అలాగే అజొల్లా యూనిట్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయాలజీ విద్యార్థులుచే నిర్మించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వసుధ, వైస్ ప్రిన్సిపాల్ కె.జివెంకటేష్,జీవశాస్త్ర అధ్యాపకులు బివి.వి.సతీష్, కె.ఉషారాణి ,జి.శ్రావణి,ఎన్.అశోక్,జీవశాస్త్రవిద్యార్థులు పాల్గొన్నారు.

పేరవరం షష్టి వేడుకలో జరిగిన ఘటనపై ఇరు వర్గాలపై కేసు నమోదు

ఆత్రేయపురం, మేజర్న్యూస్ : మండలంలోని పేరవరం గ్రామంలో శనివారం రాత్రి షష్టి వేడుకలో జరిగిన ఇరువర్గాల కొట్లాటపై మట్ట వెంకటేశ్వరరావు, తాళ్ల గణేష్ ఇచ్చిన ఫిర్యాదులపై 20 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు. దీనిపై రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అంతే తప్ప ఇలాంటి గొడవలకు దిగి శాంతిభద్రతలకు ఆకటం కలిగించకూడదని హితవు పలికారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇలాంటి దాడులకు దిగకూడదన్నారు. లేకుంటే తీవ్ర పరిమాణాలకు గురికావాల్సి వస్తుందన్నారు. ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అంతా కలిసి ఉండాలన్నారు.

హిందీ సబ్జెక్టుకు అన్ని సబ్జెక్టుల మాదిరిగా ఉపాధ్యాయులను నియమించాలి

- ఎస్ఎల్‌టిఏ సంఘం డిమాండ్

- అంబెడ్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

రావులపాలెం,మేజర్న్యూస్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భాషాపోధ్యాయ సంఘం సమావేశం ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రాష్ట్ర అధక్షులు బి.సాయిబాబా అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రములో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించి సత్వరం న్యాయం జరిగేందుకు డిఈఓ లు కృషి చేయాలని వారు కోరారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం అన్ని సబ్జెక్టు లకు ఉపాధ్యాయలను కేటాయించిన విధంగానే హిందీ భాషకు కేటాయించేందుకు త్వరగా నియమించాలని వారు డిమాండ్ చేసారు.అనంతరం కోనసీమ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.

జిల్లా అధ్యక్షులుగా ఊబలంక హై స్కూల్ తెలుగు ఉపాద్యాయిడు పావులూరి సూర్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాద్యాయుడు గానాల నరసింహాచార్యులు, మహిళా కార్యదర్శిగా కేశవరం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేయుచున్న డా.శ్రీపాద సీతామహాలక్ష్మి, సత్యవేద వెంగమాంబలను సమావేశం లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని సమావేశానంతరం ఘనంగా సత్కరించారు. వీరిని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు,పాఠశాలచైర్మెన్‌లు అభినందించారు.

ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టం చేయాలి

- 'ఆటా' డిమాండ్

ఎటపాక,మేజర్న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా,ఎటపాక మండలం ఎంపిడిఓ మీటింగ్ హాల్ నందు ఆదివారం ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మండల మహాసభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన హక్కులు, చట్టాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు.భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ప్రాంతాలలో ఆర్టికల్ 244 (1) ,పేరా 4 ప్రకారం ఉద్యోగ నియామకాలు శత శాతం స్థానిక ఆదివాసులకి ఇవ్వాలని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ టీఏసి ఏపీ తీర్మానం తేదీ:18 -06-2020 ప్రకారం ప్రత్యేక ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. జీవో నెంబర్ 3కి వ్యతిరేకంగా స్థానిక ఆదివాసులకు రావలసిన ఉద్యోగాలు మైదాన ప్రాంత గిరిజనేరులకు షెడ్యూల్ ప్రాంతాలలో ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను అక్రమంగా తమ శాఖ కాకపోయినా అత్యుత్సాహంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలో నియమించిన అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయకపోతే న్యాయపోరాటం చేసి కోర్టులో దోషిగా నిలబెడతామని అయన అన్నారు. గురుకుల ఒప్పంద ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి-2 సరియం రాజులు, రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను, జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, మండల అధ్యక్షులు కాక రాజు, ప్రధాన కార్యదర్శి కాక శివశంకర్, నూప అనిల్, మహిళా అధ్యక్షులు సంఘం గంగాభవాని, వేప సునీత, పాయల తులసి, పదం పుల్లమ్మ, కుర్సం కవిత తదితరులు పాల్గొన్నారు.

సేవలు సకాలంలో అందించకపోతే మానవ హక్కుల ఉల్లంఘనే

రంపచోడవరం,మేజర్న్యూస్ : ప్రజలకు పౌర సేవలు సకాలంలో అందించకపోతే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టేనని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బాలు అక్కిస పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో జరిగిన జాతీయ మానవ హక్కుల సదస్సులో హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు, జాతీయ అవార్డు గ్రహీత బాలు అక్కిస ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా మానవ హక్కుల ఉల్లంఘన అనగానే పోలీసులు ఎట్రాసిటీ కస్టోడియల్ డెత్‌లు చూస్తారని, కానీ మానవ హక్కులు ఉల్లంఘన అనేక అంశాలలో చూడవచ్చు అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పొందుపరచిన హక్కులు అమలు పర్చకపోవడం, ప్రజలకు సురక్ష త్రాగునీరు అందించకపోవడం, మారుమూల గ్రామాలకు సక్రమమైన రోడ్లు ఏర్పాటు చేయకపోవడం, సమయానికి రోగులకు సరైన వైద్యం అందించకపోవడం మానవ హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తాయన్నారు. అలాగే అర్హత వున్నా సామాజిక భద్రత పథకాలలో పెన్షన్లు ఇవ్వకపోవడం, విభిన్న ప్రతిభావంతులకు ఏర్పాటు చేయవలసిన ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయకపోవడం, విద్య హక్కు చట్టంలో 25 శాతం సీట్లు పిల్లలకు, బలహీన వర్గాలకు కార్పొరేట్ స్కూల్స్‌లో అడ్మిషన్లు ఇవ్వకపోవడం, అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలు చేయకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనే అని అన్నారు. కాగా 2013 భూసేకరణ చట్టంలో ఉన్న అంశాలు అమలు పరచకపోవడం, ప్రజలకు అందించవలసిన సేవలు సకాలంలో అందించకపోవడం, సమాచార హక్కు చట్టం 2005ను సక్రమంగా అమలు చేయకపోవడం, ఇటువంటి అంశాలన్నీ మానవ హక్కుల ఉల్లంఘన పరిధిలోకి వస్తాయని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ బాలు తెలిపారు. ఆయా అంశాలపై సదస్సులో ప్రసంగించినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిస్సా రాష్ట్రాల నుండి జాతీయస్థాయి హ్యూమన్ డిపెండర్స్ పాల్గొన్నారని బాలు అక్కిస పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలు సరికాదు

రంపచోడవరం,మేజర్న్యూస్ : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిపై కొంతమంది నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని రంపచోడవరం తెలుగుదేశం పార్టీ తెలుగు కార్మిక సంఘం ఉపాధ్యక్షులు సలాది బాపిరాజు అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఆమె భర్త మఠం విజయభాస్కర్ పేర్లు చెప్పుకొని కొందరు ఎటపాక మండలంలో ఇసుక అమ్మకాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు కొందరు ప్రచారం చేయడం హేయమైన చర్య అని అన్నారు. అదేవిధంగా రంపచోడవరం తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి మోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష దేవి విజయభాస్కర్ దంపతులు ఎమ్మెల్యేగా ఎన్నికైన కొద్ది కాలంలోనే నియోజకవర్గం ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు పదివేలు నుంచి 20వేలు రూపాయలు అందించాలన్నారు. ఎమ్మెల్యేగా శిరీష దేవి ఎన్నికైన తర్వాత తొలి నెల జీతంతో ఏజెన్సీ ప్రాంతంలో నాలుగు ప్రభుత్వ ఆసుపత్రులకు ఇన్వెస్టర్లు, బ్యాటరీలు అందించడం, నియోజకవర్గం పరిధిలోని ప్రజలు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతూ ఎవరైనా మరణిస్తే ఆ సమయంలో ఆర్థికంగా లేనివారి మృతదేహాలను వారి గ్రామాలకు తరలింపుకు సహాయం చేస్తున్నారని, సొంతంగా డబ్బు ఖర్చు చేసుకొని వెళ్లలేని స్థితిలో ఉండే కుటుంబాలకు ఆపదలో సొంత వాహనాన్ని అంబులెన్స్‌గా మార్చి మృత దేహాలను వారి స్వగ్రామాలకు ఉచితంగా తరలించడం జరుగుతుందన్నారు. ఈ విధంగా ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ నియోజవర్గం ప్రజలు నుంచి మంచిగా మన్ననలు పొందుతూ ఉంటే ఈ విషయాన్ని గమనించిన కొంతమంది ఓర్వలేక ఎమ్మెల్యే దంపతులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి మోహన్, తెలుగు కార్మిక సంఘం ఉపాధ్యక్షులు సలాది బాపిరాజు, ముసురుమిల్లి బూత్ ఇంచార్జీ కడబాల గణపతి రెడ్డి, ఈక బాపిరాజు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించాలి - డివైఇఓ ప్రభాకర శర్మ

పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దాపురం పట్టణంలో జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దాపురం డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించేలా చర్యలు తీసుకుందని తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లల యొక్క చదువుపై, ప్రవర్తనపై దృష్టి పెట్టాలని, అలాగే నిరంతరం స్కూల్‌కి వచ్చి వారి పిల్లల యొక్క ప్రగతికి సంబంధించి ఉపాధ్యాయులతో చర్చించాలని ఆయన సూచించారు. ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా అలవర్చుకుని ఉన్నత భవిష్యత్ అందుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ ఛైర్ మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదిక వారి తల్లితండ్రులకు తెలియజేశారు. హెూలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులను అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి ఛైర్మన్ మరియు విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు నూకరాజు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'బర్రి నాగేశ్వరరావు & పాలెపు రాఘవేంద్రరావు' ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరం

కాకినాడ,మేజర్న్యూస్:బర్రి నాగేశ్వరరావు&పాలెపు రాఘవేంద్ర రావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరం నిర్వహించినట్లు ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. కాకినాడలోగల బర్రి నాగేశ్వరరావు & పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో రెడ్ క్రాస్ సోసైటీ సౌజన్యంతో మెగా రక్తదాన శిభిరం నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఎన్. మూర్తి అద్యక్షత హించగా మేనేజింగ్ ట్రస్టీ తులసమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మెగా రక్తదాన శిబిరం ప్రారంబించారు. పెద్ద సంఖ్యలో ట్రస్ట్ సభ్యులు పాల్గొని స్వచ్ఛంద రక్తదానం చేసారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ట్రస్టీ వి.ఎస్.ఆర్.మూర్తి మాట్లాడుతూ ట్రస్ట్ ఏర్పాటు చేసి మూడు వసంతాలు ఏప్రిల్ నెలతో పూర్తి అవుతుందని, ఏప్రిల్ నెలలో మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహి స్తున్నాట్లు వెల్లడించారు.ఈకార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ తులమమ్మ, ట్రస్ట్ ట్రస్టీలు భారతి,శాంతి, వి.మల్లి ఖార్జునరావు, ఏడుకొండలు, వినయ్, రామకృష్ణ, గోవిందరాజులు, రాజబాబు, సుశీల, ఖాజ, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొని స్వచ్ఛంద రక్తదానం చేసారు.

పెద్దాపురంలో ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షలు

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం పట్టణంలో ఆదివారం నాలుగు సెంటర్లలో నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి వి.ఆర్.కె.చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పెద్దాపురం పట్టణంలో స్థానిక జవహర్ లా ల్ నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ నందు 240 మందికి236 మంది హాజరయ్యారని, నారాయణ స్కూల్ లో264 మందికి250 మంది, సాగర్ హైస్కూల్లో 240 మంది కి 223మంది, గర్ల్స్ హైస్కూల్లో 312 మందికి 285 మంది హాజరయ్యారని ఎంఈఓ వి.ఆర్.కే చౌదరి తెలిపారు.

మంచి ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాల కోసం అధికంగా ప్రోటీన్లు తీసుకోవాలి - డా.అడ్డాల

కాకినాడ,మేజర్‌న్యూస్ : వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణకు గాను ప్రోటీన్లను అధికంగా తీసుకోవాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.నేటి ఆధునిక జీవనశైలి కారణంగా పలువురు అనారోగ్యానికి గురువుతున్నారని అన్నారు. వయసు పెరిగే కొద్దీ అనారోగ్య సమస్యలు అధికమవుతాయి కాబట్టి ప్రోటీన్లను తీసుకోవాలని అన్నారు. ఉప్పును పరిమితంగా తీసుకోవడంతో పాటుఆకుకూరలు,పండ్లను ,డ్రై ఫ్రూట్స్‌ను అధికంగా తీసుకోవాలని అన్నారు. శరీరానికి శక్తిని అందించడానికి కొవ్వు కూడా అవసరమేనని డాక్టర్ అడ్డాల తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాఘవరావు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ను పరిశీలించిన ఆర్డీఓ

పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదివారం పెద్దాపురం పరిధిలో గల శ్రీ వెంకటేశ్వరా రైస్ ఇండస్ట్రీస్‌ను పరిశీలించి, తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తేమ శాతం, ఇతర కారణాలతో ధాన్యం వాహనాలను వెనక్కు పంపకూడని మిల్లు యాజమాన్యానికి సూచించారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన ధాన్యం కొనుగోలు వాహనాన్ని ఆలస్యం చేయకుండా అత్యంత ప్రాముఖ్యతనిచ్చి ధాన్యం వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమాన్యాన్ని ఆదేశించారు. తద్వారా రైతులకు న్యాయం చేయడమే కాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా మరియు సవ్యంగా నిర్వహించడంలో కీలకంగా ఉంటాయని ఆమె తెలిపారు. ఆమె వెంట డిప్యూటి తహశీల్దార్ కాంతారావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కడియం నర్సరీలలో సందడి చేస్తున్న సీజనల్ మొక్కలు

-సందర్శకులను రా...రమ్మని ఆహ్వానిస్తున్నాయి

-డిసెంబర్, జనవరి నెలలలో వీటిదే హవా

ఉమ్మడిగోదారి జిల్లాల సూర్యబ్యూరో :క్రిస్మస్,నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు మన ఇంట్లో బంధుమిత్రులు సందడి చేయడం అందరికీ తెలిసిందే. అయితే ఈ పండుగలలో అథిదిలుగా మన వాకిట్లోకి ఈ సీజనల్ మొక్కలు కూడా వస్తాయి. శీతాకాలం మంచు బిందువులతో విచ్చుకొనే ఈ అందాల భామలు అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటాయి. మనింట్లో ఎన్ని రకాల మొక్కలు ఉన్నా కేవలం శీతాకాలంలో మాత్రమే ఈ ప్రాంతంలో జీవించగలిగే సీజనల్ మొక్కల సందడే వేరు.కొందరు రైతులు వీటిని స్థానికంగానే వేర్లు,దుంపలు, విత్తనాలు ద్వారా ఉత్పత్తి చేసారు.ఈ మొక్కలు ప్రాణం పోసుకుని అందాలు ఆరబోయడానికి ముస్తాబు అవుతున్నాయి.మరికొందరు రైతులు పూణే,బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పలు రకాల మొక్కలతో నర్సరీలు సందడిగా మారాయి.దేశవ్యాప్త ప్రసిద్ధి గాంచిన కడియం నర్సరీల అన్నిటిలోనూ ఈ సీజన్ మొక్కలే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.వీటిని విరివిగా కొనుగోలు చేసి కిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలు కొత్తదనంతో జరుపుకు నేందుకు అనేకమంది తహతహ లాడుతున్నారు.ఇప్పటికే వీటి అమ్మకాలు ఊపందుకున్నాయి. మన ఇంట్లో రోజూ కనిపించే మొక్కల కంటే ఇవి చాలా భిన్నంగా.. అందంగా ఉంటాయి.డిసెంబరు ఆరంభం నుంచి ఈ సీజనల్ మొక్కల సందడి చేస్తాయి.ఫిబ్రవరి ప్రారంభం నుంచి మంచు తగ్గడం మెదలవ్వడంతోఈ మొక్కలు తనువుచాలిస్తాయి. అందుకనే సందర్శకులు కూడా డిసెంబరు, జనవరి నెలల్లో కడియం నర్సరీలను తిలకించడానికి పెద్ద ఎత్తున వస్తుంటారు.వారిని ఆకట్టుకునే విధంగా నర్సరీ రైతులు కూడా ఈ మొక్కలను ఒక క్రమబద్ధంగా ఉంచి అందర్నీ కనువిందు చేయిస్తారు.ఇప్పుడు ఏనర్సరీకి వెళ్ళినా రా.. రమ్మని ఇంద్రధనస్సుల మాదిరిగా ఉండే ఈ సీజనల్స్ మొక్కలు ఆహ్వానం పలుకుతున్నాయి.పలు రంగులతో ఉండే బంతి, చామంతిలతో పాటు పిటోనియా, బిగోనియా, వింకారోజ్,దయాంతాస్,జినియా, జర్బరియా, ఫెంటాస్, కొలియన్ కలర్స్, సాల్వియా సిల్వర్ కోకాస్, చైనా పింక్, లింక్ రోజ్, కారోనియా వంటిఅనేక రకాల సీజనల్ మొక్కలు కడియం నర్సరీలలో సందడి చేస్తున్నాయి. సందర్శకులు ఈ సీజనల్ మొక్కల అందాలు ఆస్వాదించేందుకు తహతహలాడుతున్నారు. కేవలం వాటి అందాలను చూసి వెళ్లిపోవడమే కాక నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి ఇంటిని అలంకరించుకుంటున్నారు.

రైస్ మిల్లులలో జెసి రాహుల్ మీనా ఆకస్మిక తనిఖీలు

కాకినాడ, మేజర్‌న్యూస్ : జిల్లాలో రైస్ మిల్లులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం సామర్లకోట మండలంలోని ఉండూరు గ్రామంలో గల దేవి రైస్ మిల్లును, కరప మండలం అరట్లకట్ల గ్రామంలో గల వెంకటేశ్వర ట్రేడ్స్ రైస్ మిల్లులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు ఏ విధంగా చేస్తున్నారు ఏ విధంగా మిల్లుకు ఏవిధంగా తీసుకొస్తున్నారు, ఎంత రేటు కడుతున్నారు తదితర వివరాలను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ ఏం.దేవులా నాయక్, తాసిల్దార్లు డిప్యూటీతాసిల్దారులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

- పాల్గొన్న భక్తులు

పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈకార్యక్రమంలో వేద పండితులుఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి,శంకరశాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని),రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు,లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రం పరిశీలన

కాకినాడ,మేజర్‌న్యూస్ : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. పటిష్ట భద్రతతో, డ్రోన్స్ పహారాలో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాకినాడ పట్టణం నందలి జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎలక్షన్ కౌంటింగ్ సెంటర్స్, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ప్రవేశ, నిష్క్రమణల దగ్గర బందోబస్తు నిర్వహించు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణుని ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు, పోలింగ్ ఏజెంట్ల యొక్క సెల్ ఫోన్లను బయట ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ కౌంటర్ నందు జమ చేసి కౌంటింగ్ సెంటర్ లోనికి వెళ్లాలని కోరినారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాలలో, డ్రోన్ కెమెరలను వినియోగిస్తూ గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపినారు. వాహనాల పార్కింగ్ స్థలాలను కూడా పరిశీలించారు. జేఎన్టీయూ ఎదురుగా ఉన్న ఐటీఐ నందు వాహనాలు పార్క్ చేసి కౌంటింగ్ కేంద్రం లోనికి వెళ్ళాలి అని కోరినారు. కాకినాడ డిఎస్పి రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఉన్నారు.

ఎపిపిగా వినయ్ తేజ నియామకం

- వినయ్ తేజకు పలువురు అభినందనలు

పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది గన్నంరాజు వినయ్ తేజ పెద్దాపురం 7వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు 14 సం.ల నుండి ఆయన న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయన తండ్రి గన్నంరాజు సత్యనారాయణ గతంలో ఎపిపిగా పనిచేసిన అనుభవంతో పాటు న్యాయవాద వృత్తిలో సుదీర్ఘంగా నాలుగు దశాబ్దాల పాటు కొనసాగుతూ ఇప్పటికి పెద్దాపురం పట్టణంతో పాటు చుట్టు ప్రక్కల పరిసర ప్రాంతాలలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఎపిపి వినయ్‌తేజ మాట్లాడుతూ తనను ఎపిపిగా నియమించడం పట్ల సహకరించిన పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ జడ్పి ఛైర్మన్ జ్యోతుల నవీన్, ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ,అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణా రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎపిపి వినయ్‌తేజను బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు చొక్కాకుల రవిబాబు, పిట్టా సుగుణ రావు, మడికి రాంబాబు,పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించినవారిలో ఉన్నారు.

ఎక్సైజ్ దాడులలో 600లీ. బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం,మేజర్‌న్యూస్: పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి. అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని జగ్గంపేట మండలంలోని నరేంద్రపట్నం గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ప్రచార రథం

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలో రెండు రోజులపాటు ఇంద్రకీలాద్రి నుండి వచ్చినశ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ప్రచార రథం పర్యటించనున్నట్లు గురు భవాని తోట సూరిబాబు, కాళ్లకూరి రాంబాబులు తెలిపారు. వైదిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార రథం ఆదివారం గొంటువాణిపాలెం,పుల్లి గోగులపాడునుండి మండలంలోనిమంగంపాడు నుండి మారేడు బాక, బలిజపాడు, వంచంగి,జి కొత్తపల్లి, చికి లింత, కొమరాపురం,వణకరాయి నుండి అమ్మవారు గ్రామ గ్రామన్న పూజలు అందుకొని జడ్డంగి ఆదివారం రాత్రికి చేరుకుంటున్నట్లు వారు తెలిపారు.

కాగ చికిలింతలో కుంకుమ పూజ, మిగిలిన గ్రామాల్లో గ్రామోత్సవంనిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ రథం ఇంద్ర కిలాద్రి నుండి ఈ నెల 6న బయలుదేరి పశ్చిమగోదావరి జిల్లా మీదుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట, ఏలేశ్వరం, తూర్పులక్ష్మీపురం, కిమ్మూరు, గొంటువాణిపాలెం మీదుగా జడ్డంగిఅన్నవరం చేరుకొని శనివారం రాత్రి అక్కడబసచేసినట్లు గురుభవానీసూరిబాబు, రాంబాబు తెలిపారు.అలానే సోమవారం ఉదయం జడ్డంగిలో బయలుదేరి, వట్టిగడ్డ,దూసర పాము, రాజవొమ్మంగి మీదుగా కేడిపేట,పెదవలస, చింతపల్లి, పాడేరు, అరకు మీదుగా సాలూరు వరకు ఈ రథంహిందూ ధర్మప్రచారం చేసుకుంటూ వెల్లనున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

కాకినాడ, మేజర్‌న్యూస్ : తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదు అయ్యాయాని ఆయన తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్టీయూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరచడం జరిగిందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్ల ఉదయం 6.00 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుల్స్‌పై 9 రౌండ్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఆయన అన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. తొలి దశలో ప్రాథమిక ఓట్లు లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

డాక్టర్ ఆర్‌యస్ రత్నాకర్ లాంటి నాయకుడు అవసరం

-రాష్ట్ర రాక్స్ సెక్రెటరీ కళ్యాణ్

రౌతులపూడి, మేజర్‌న్యూస్ : మాలలకు రత్నాకర్ లాంటి నాయకుడు అవసరమని మాల మహానాడు,దళిత సంఘాలలు ఐక్యతతో ముందు సాగాలని రాష్ట్ర రాక్స్ సెక్రటరీ కళ్యాణ్ అన్నారు. మాలలకు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ బలమైన నాయకత్వం అవసరమని మాల మహానాడు నాయకులు ఆయనకు మద్దతు పలికాలని కోరారు.ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో దళిత నాయకులు తీర్పును పునః పరిశీలించాలని పలు రివ్యూ పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే కోర్టు వాటిని కొట్టేయడంతో నాయకులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అంతేకాకుండా రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు కదులుతామని ఇప్పటికే ప్రభుత్వాలపై నిరసన సభలు ప్రారంభించారు రాక్స్ జాతీయ అధ్యక్షులు మాల మహానాడు నాయకులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్.వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు,మమ్మలను విడదీయొద్దు అనే నినాదంతో ముందుకు కదులుతున్నారు.ఈ నేపథ్యంలో మాలలకు డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ లాంటి బలమైన నాయకత్వం అవసరమని పలు మాల మహానాడు, దళిత సంఘాలు నేతలు ఆయనకు మద్దతు పలుకుతుండటం శుభ పరిణామం అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గత 30 సంవత్సరాలుగా మొట్టమొదటి మాల మహానాడు సంఘస్థాపన నుంచి అనేక సమ్మెలు నిరాహార దీక్షలు నిరసనలతో మాలల శ్రేయస్సు కోసం పరితపించారని ఆయనను కొనియాడారు.అలాంటి నాయకత్వం ప్రస్తుతం మాలలకు అవసరమని అన్నారు.కాగా డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన క్షణం నుంచి ఇప్పటికే 300లకు పైగా గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ మాలలను చైతన్యపరచడం జరుగుతుందన్నారు. నాయకులకి ఎవరికీ సాధ్యం కాదని, గ్రామల స్థాయిలో అవగాహన పరచడం సామాన్య విషయం కాదని తెలిపారు.గ్రామాల్లోని ప్రజా చైతన్యం అవసరమని అన్ని రాష్ట్రాల్లో ఇది జరగాలని తద్వారా వచ్చే ఎన్నికలలో వర్గీకరణకు కారణమైన పార్టీల పాలకుల కుర్చీలు గల్లంతు అవుతాయని జోష్యం చెప్పారు.అందుకే అలాంటి నాయకత్వానికి మద్దతు తెలపాలని మాల మహానాడు దళిత పెద్దలు నాయకులు యువకులు,విద్యావంతులు,ప్రజలను ఆయన కోరారు.

సవాల్ విసిరుతున్నా.. చర్చకు సిద్ధమా : వర్మ

- వైసీపీ నేతలకు సవాలు విసిరిన మాజీ ఎమ్మెల్యే వర్మ

- కాకినాడ ఎస్ఈజడ్ భూ దోపిడిపై నిజాలు నిగ్గు తేల్చాలి

- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ

పిఠాపురం, మేజర్‌న్యూస్ : ఎస్సీ జెడ్ భూములు పై వైసీపీ నేతలకు సవాల్ విసిరుతున్నానని, వైసీపీ నేతలకు దమ్ముంటే పిఠాపురం సెంటర్లో బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సవాల్ విసిరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ... పిఠాపురం నడిబొడ్డున ఎస్ ఈ జడ్ భూ దోపిడీపై చర్చకు వైసిపి నేతలు సిద్ధమా అని వర్మ ప్రశ్నించారు. సిబిఐ, ఈడి విచారణ కోరుతున్న వైసీపీ నేతలు దొంగే దొంగ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎటువంటి విచారణకైనా టిడిపి ఎప్పుడు సిద్ధమేనని, మేము అన్ని పత్రాలతో చర్చకు సిద్ధంగా ఉన్నామని, పిఠాపురం ఉప్పాడ బస్టాండులో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కే ఎస్ ఈ జెడ్ వ్యవహారంలో రైతులను నిలువునా ముంచింది జగనేనని, వైసీపీ నేతలు నేరుగా రైతుల భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం ఇందుకు ఉదాహరణని, కేవలం పెయిడ్ ఆర్టిస్టులతో వైసిపి నాటకాలు ఆడుతోందన్నారు. కె ఎస్ ఈ జెడ్ భూముల సేకరణ మరియు సెజ్ ఏర్పాటు దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగినదని, కేవీపీ రామచంద్రరావు ఇంటి ఎదురుగా ఉన్నటువంటి కెవి రావుకి బినామిల పేరుతో భూముల సేకరణ జరిగినదని, కానీ కె ఎస్ ఈ జెడ్ భూముల రైతులకు నారా చంద్రబాబు నాయుడు హయాంలోనే న్యాయం జరిగిందని, వైసీపీ నాయకులు కోరుకున్నట్లు సిబిఐ కావాలంటే సిబిఐ, ఈ డి కావాలంటే ఈడి ఎంక్వైరీ వేస్తామన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో చట్టం ప్రజల పక్షాన నడుస్తుందని, సోమవారం అనగా నేటి సాయంత్రం మూడు గంటలకు పూర్తి ఆధారాలతో పిఠాపురం పట్టణం ఉప్పాడ బస్టాండ్ వద్ద కు బహిరంగ ప్రెస్ మీట్‌కు (చర్చ) రెడీగా ఉంటాను, మీ వైసీపీ నాయకులు (కురసాల కన్నబాబు, దాడిశెట్టిరాజా మరియు వంగ గీత) అందరూ రావాలి, రాణిపక్షంలో మీరు తప్పు చేసినట్లు మేము భావిస్తామన్నారు.

మనువాద శక్తుల నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శిలు ప్రభాకర్, సుబ్బారావు

కాకినాడ,మేజర్‌న్యూస్ : భారత రాజ్యాంగం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంగా అవతరించిందని దానిని నేడు మోదీ ప్రభుత్వం మార్చాలని చూస్తందని, ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష- ప్రధాన కార్యదర్శిలు జెవి ప్రభాకర్, కరవది సుబ్బారావులు పిలుపునిచ్చారు. ఆదివారము మధ్యాహ్నము స్థానిక పి.ఆర్.భవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాఖ రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం ఎంత ఉన్నతమైనదైనా దాన్ని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే ఉపయోగం లేదని, పాలకులు భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. భారతదేశంలోని భిన్నత్వం, అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించాలనే దృక్పథం రాజ్యాంగంలో కనిపిస్తుంది. దళితులు, గిరిజనులు, ఇతర వెనకబడిన తరగతుల ప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాంగంలో అనేక నిబంధనలను పొందుపరిచారు, కానీ పాలకులు రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు పరచడం లేదని బడుగు బలహీన వర్గాలకు ఏమాత్రం న్యాయం జరగడం లేదని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇందుకు పోరాటమే శరణ్యమని ప్రజలు కార్మికులు విద్యార్థులు ఉపాధ్యాయులు యువకులు మేధావులు దళితులు గిరిజనులు భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి పోరాటాలకు సన్నద్ధం కావాలని వారన్నారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, ప్రముఖ న్యాయవాది టి.ముకేష్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి టి.అన్నవరం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజువర్ధన్, సీపీఐ సీనియర నాయకుడు చింతపల్లి సుబ్బారావు, సర్పంచ్ బల్ల సురేష్ ప్రసాద్, కన్నబాబు, సుబ్బారావు, అజిత్ తదితరులు ప్రసంగించారు.

నగరంలో నటి శ్రీలీల సందడి

- జెసి మాల్ ప్రారంభం

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడలో సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆమె రాక కోసం ప్రేక్షకులు, అభిమానులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఆమె ఆదివారం కాకినాడ మెయిన్ రోడ్లో జేసీ మాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె షాపింగ్ మాల్ మూడంతస్తులు తిరిగి వివిధ రకాల చీరలు, వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం శ్రీలీల మాట్లాడుతూ కాకినాడ రావడం తనకు చాలా సంతోషంగా ఉందని గతంలో కూడా ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. షాపింగ్ మాల్ సందర్శించానని ఇక్కడ రకరకాల ఉత్పత్తులు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రత్యేక తగ్గింపులు సరసమైన ధరలు అందిస్తున్న షాపింగ్ మాల్లో దుస్తులు కొనుగోలు చేయాలని సూచించారు. నటి శ్రీలీలను చూసేందుకు ప్రేక్షకులు అభిమానులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : ఇంట్లో ఉన్న సమస్యలపై ఆత్రేయపురానికి చెందిన ఒక వ్యక్తి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆత్రేయపురానికి చెందిన వారా తాతారావు (44) దీర్ఘవ్యాధికి గురయ్యాడు. దీంతో పాటుగా తనకున్న ఇరువురు పిల్లలకు వివాహం చేయలేకపోతున్నానని మనస్థాపానికి గురై ఈనెల 4న పురుగుల మందు తాగాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.